# ప్రతిరోజూ నీటి సరఫరా

## వచ్చే ఐదేండ్లలో ఇదే మా లక్ష్యం.. పదేండ్లలో 24 గంటల సరఫరా



జీహెచ్‌ఎంసీ కాలనీ సంఘాల ప్రతినిధుల సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి కేటీఆర్

- కారు మంచిగున్నది.. డ్రైవర్ మంచిగున్నడు.. ఎందుకు మార్చుకోవాలి?
- మంచి ప్రభుత్వాన్ని కాపాడుకొంటూ.. వెన్ను తట్టడం మన బాధ్యత
- తొమ్మిదిన్నరేండ్లలో కులం, మతం పేరిట ఒక్క ఎఫ్ఐఆర్ లేదు
- నగరంలో విద్యావంతులు ఓటింగ్‌కు దూరంగా ఉండటం మంచిది కాదు
- బయటికొచ్చి... క్యూలో ఉండి నచ్చిన నాయకుడికి ఓటు వేయండి
- జీహెచ్‌ఎంసీ కాలనీ సంఘాల ప్రతినిధుల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): 'గత తొమ్మిదిన్నరేండ్లలో హలాల్... హిజాబ్ పేరిట పిచ్చి పంచాయితీలు లేవు... ప్రాంతం పేరిట తన్నుకోవడం లేదు... కేవలం మా నగరం, మా రాష్ట్రం, మా ప్రజలు బాగుండాలనే ఫోకస్ తప్ప.. వేరే ధ్యాస లేదు..' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో కులం, మతం పేరిట ఒక్క ఎఫ్ఐఆర్ కూడా నమోదు కాలేదని... స్థిరమైన ప్రభుత్వం-సమర్థవంతమైన నాయకుడు (స్టేబుల్ గవర్నమెంట్... ఏబుల్ లీడర్ షిప్) ఉండటమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. జూబ్లీహిల్స్ జేఆర్‌సీ కన్వెన్షన్ హాల్‌లో శనివారం జరిగిన జీహెచ్‌ఎంసీ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ... 'కారు మంచిగున్నది... డ్రైవర్ కూడా మంచిగున్నప్పుడు ఎందుకు మార్చుకోవాలి? ప్రజలు ఆలోచించాల'న్నారు. చక్కగా పాలిస్తున్న ప్రభుత్వంలో చిన్న చిన్న లోటుపాట్లు సరి చేసుకోవచ్చన్నారు. మంచి ప్రభుత్వం ఉన్నప్పుడు దానిని కాపాడుకుంటూ.. వెన్నుతట్టి ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంటుందన్నారు. బాగా పని చేసిన ఏ ప్రభుత్వాన్ని కూడా ప్రజలు వదులుకోరని... ఎవరెన్ని మాట్లాడినా, సోషల్ మీడియాలో కొన్ని వ్యతిరేక ప్రచారాలు చేసినా... కండ్ల ముందు జరిగిన అభివృద్ధిని మాత్రమే ప్రజలు నమ్ముతారని అన్నారు. వచ్చే ఐదు సంవత్సరాల టర్మ్‌లో హైదరాబాద్ మహా నగరంలో ప్రతిరోజూ మంచినీటి సరఫరా... రానున్న పది సంవత్సరాల్లో 24 గంటల నీటి సరఫరా తమ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా తొమ్మిదిన్నరేండ్లలో హైదరాబాద్ మహా నగరంలో జరిగిన అభివృద్ధి.. ఇంకా జరగాల్సిన అభివృద్ధికి సంబంధించి రూపొందించిన ప్రణాళికలను ఆయన పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

### 24 గంటల కరెంటు సరఫరా..

హైదరాబాద్‌లో విద్యుత్ సరఫరాను దేశమే అబ్బురపడేలా మెరుగుపరిచాం. అంతటా కరెంటు సరఫరా 24 గంటల పాటు నిరంతరాయంగా ఇస్తున్నాం.

### ఎస్ఆర్‌డీపీ ఫలితాలు..

వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఆర్‌డీపీ) కింద నగరంలోని ప్రతి మూలలోనూ మంచి ఫలితాలు ఉన్నాయి. సికింద్రాబాద్ రైల్వే అండర్‌పాస్‌లు, ఆర్వోబీలు... మల్కాజిగిరిలో ఈస్ట్ ఆనంద్‌బాగ్ పరిధిలో ఆర్‌యూఏబీలు... ఉప్పల్‌లో చర్లపల్లి వైపు ఆర్‌యూబీలు... ఎల్బీనగర్-నాగోల్-బైరామల్‌గూడ జంక్షన్ల అభివృద్ధి.. ఇలా అన్నీ మీ కండ్ల ముందున్నాయి. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలోనే అత్యధికంగా ఎస్ఆర్‌డీపీ పనులు జరిగాయి. నగరంలో ఎక్కడెక్కడ మిస్సింగ్ రోడ్లు ఉన్నాయో గూగుల్‌లో వెతికి 136 లింకు రోడ్లను అభివృద్ధి చేశాం.

### ఐటీ రంగంలో హైదరాబాద్ దూకుడు..

తెలంగాణ ఏర్పడినప్పుడు హైదరాబాద్‌లో మూడున్నర లక్షల మంది ఐటీ ఉద్యోగులు ఉంటే ఇప్పుడు పది లక్షల మంది వరకు ఉన్నారు. టెక్నాలజీలో కొత్త ఉద్యోగాల కల్పనపరంగా గత ఏడాది దేశంలో తెలంగాణ నుంచి 33 శాతం ఉద్యోగాలు ఉంటే, ఈ సంవత్సరం 44 శాతంగా ఉంది. లైఫ్ సైన్సెస్ రంగంలో నాలుగు లక్షల మంది పని చేస్తున్నారు. అయితే టెక్నాలజీ ఉద్యోగాలకు సంబంధించి ఒక్క ఉద్యోగం ద్వారా పరోక్షంగా ముగ్గురు, నలుగురు ఉపాధి పొందుతారు.

### నచ్చిన నాయకుడికి ఓటు వేయాలి

'గ్రామాల్లో ఓటింగ్ అంటే ఓటర్లు బ్రహ్మాండగా పాల్గొంటారు.. కానీ హైదరాబాద్‌లో మాత్రం చదువుకున్న వాళ్ల ఓటింగ్‌కు రారు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నమోదవుతున్న పోలింగ్ కూడా స్లమ్స్ నుంచి ఎక్కువగా అవుతుందన్నారు. బయటికొచ్చి ఓటేయకపోతే.. లాభం లేదన్నారు. ఓటు హక్కు వినియోగించుకొని... నచ్చిన, మంచి నాయకుడిని ఎన్నుకోవాలని, లేకపోతే ఆతర్వాత ట్విట్టర్‌లో ఎంత అరిచినా లాభం ఉండదన్నారు. గంట ఆలస్యమైనా ఓపికగా క్యూలో నిల్చొని మీకు నచ్చిన నాయకుడికి ఓటు వేయాలని ఆయన విద్యావంతులను కోరారు.

### అపోహలు పటాపంచలు..

**తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రకాశ్**

తెలంగాణ ఏర్పాటైన సందర్భంలో ఎన్నో అపోహలు, అనుమానాలు ఉండేవని తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రకాశ్ అన్నారు. కానీ ఆతర్వాత అవన్నీ పటాపంచలు అయ్యాయన్నారు. హైదరాబాద్‌లో అలజడులు జరుగుతాయని, పెట్టుబడులు రావని, విద్యుత్ సమస్యలు వస్తాయని అప్పటి సీఎం కిరణ్‌కుమార్ భయాందోళనలు కలిగించాలన్నారు. కానీ తొమ్మిదిన్నరేండ్లలో ఏ ఒక్క ఘటన లేకుండా పాలన అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రాంతీయ విబేధాలకు తావులేకుండా, నగరవాసులకు ప్రశాంతతను అందిస్తూ.. లవబుల్, లివబుల్, సేఫెస్ట్ సిటీగా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దారని వ్యాఖ్యానించారు. నగరంలో తాగునీటి, మురుగునీటిని తొలగించేలా కార్యాచరణ అమలు చేశారన్నారు. 360 ఎంఎల్‌డీల నుంచి 563 ఎంఎల్‌డీల నీటిని నిత్యం నగరానికి సరఫరా చేసేలా ఆధునీకరణ చేపట్టారని చెప్పారు. నగరం నలువైపులా తాగునీరు సరఫరా అవుతున్నదన్నారు. కార్యక్రమంలో యూఆర్‌డబ్ల్యూఏ సెక్రటరీ మేజర్ శివకిరణ్, వెల్ఫేర్ కమిటీ ప్రెసిడెంట్ శ్రీనివాసన్, వెల్ఫేర్ కమ్యూనిటీ ప్రతినిధి గీతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### మంచినీటికి ఢోకా లేదు..

నేను హైదరాబాద్‌లోనే పుట్టి, పెరిగా... చిన్నప్పుడు స్కూల్, కాలేజీకి ఖైరతాబాద్ మీదుగా వెళ్తున్నప్పుడు జలమండలి వద్ద ప్రతి ఎండాకాలంలో నీటి కోసం ఆందోళనలు జరిగి, ట్రాఫిక్ జామ్ అయ్యేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కృష్ణా, గోదావరి మంచినీటి పథకాలు పూర్తి చేసి... రోజు విడిచి రోజు నీటి సరఫరా ఇస్తున్నాం. రానున్న ఐదేండ్లలో ప్రతి రోజూ నీటి సరఫరా ఇస్తాం. ఆ తర్వాత మరో ఐదు సంవత్సరాలు.. అంటే పదేండ్లలో నగరంలో 24 గంటల పాటు ఎక్కడ నల్లా తిప్పినా నీళ్లు వచ్చే పరిస్థితి ఉండాలనేది నా కల, సీఎం కేసీఆర్ కల.

### కరోనా సమయమూ సద్వినియోగం..

మౌలిక వసతుల కల్పనలో తెలంగాణ ప్రభుత్వం గణనీయమైన పురోగతి సాధించింది. తొమ్మిదిన్నరేండ్లలో రెండు సంవత్సరాలు కరోనా వల్ల వంద శాతం పని చేయలేకపోయాం. లాక్‌డౌన్ సమయాన్ని కూడా సద్వినియోగం చేసుకొని రోడ్లు వేసుకున్నాం. లేబర్ క్యాంపుల్లోకి వెళ్లి... మీ ఆరోగ్యాన్ని చూసుకుంటాం..అదనపు డబ్బులు ఇస్తామని బతిమిలాడి కార్మికులను తీసుకొచ్చాం. ఎందుకంటే నగరంలో అర్ధరాత్రి 12 నుంచి ఉదయం ఆరు గంటల వరకు మాత్రమే రోడ్లపై పనులు చేయగలం. మిగతా సమయాల్లో ట్రాఫిక్‌ను ఆపలేం. కరోనా సమయంలో 24 గంటల పాటు రహదారులు ఫ్రీగా దొరికాయి. అలాంటి అవకాశం ఎప్పుడూ రాదని రహదారులను అభివృద్ధి చేసుకున్నాం.

## చేశాం... ఇంకా చేస్తాం..

- ప్రస్తుతం మెట్రో రైలు 70 కిలోమీటర్ల మేర ఉంది. రాబోయే 7-10 సంవత్సరాల్లో 415 కిలోమీటర్ల విస్తరించాలి. నగరంలో కాలుష్యరహిత ప్రజా రవాణాను ప్రాధాన్యతా క్రమంలో ఉంచాలనేది మా లక్ష్యం.
- పారిశుధ్యం కొంత వరకు మెరుగుపడింది. 2015లో రోజుకు 3500 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ ఉంటే.. ఇప్పుడు రోజుకు7500-8000 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ జరుగుతున్నది. చిన్న చిన్న లోపాలు ఉన్నాయి.. వాటిని సవరిస్తాం.
- కేవలం కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు మాత్రమే నగరాభివృద్ధిలో కాలనీ సంఘాల భాగస్వామ్యం కూడా ఉండాలి. ఈసారి ఆ దిశగా కొంత ప్రయత్నం చేశాం. వచ్చే టర్మ్‌లో కచ్చితంగా దీనిని సంపూర్ణ స్థాయిలో అమలు చేస్తాం.
- వంద శాతం మురుగునీటిని శుద్ధి చేసే నగరం దేశంలోనే ఒకే ఒకటి... అది తెలంగాణ. నగరంలో రోజుకు 2వేల మిలియన్ టన్నుల మురుగు ఉత్పత్తి అవుతుండగా... పూర్తిస్థాయిలో శుద్ధి చేస్తున్నాం. అక్టోబరు మాసానికే ప్రాజెక్టులన్నీ పూర్తయ్యాయి. కానీ కోడ్ వల్ల ప్రారంభించలేదు. డిసెంబర్‌లో అన్నీ ప్రారంభిస్తాం.
- పకడ్బందీ శాంతిభద్రతలు అనేది సీఎం కేసీఆర్ తీసుకున్న మొదటి నిర్ణయం. గత తొమ్మిదిన్నరేండ్లలో కుల, మత, ప్రాంత పంచాయితీలు లేవు. మహిళల కోసం షీ టీమ్స్, నగరంలో ఐదు లక్షల సీసీ కెమెరాలు ఇలా అనేక సేఫ్ సిటీ కోసం ఎన్నోరకాల చర్యలు చేపట్టాం.
- నగరంలో పర్యావరణాన్ని మరింత పెంపొందించేందుకు వచ్చే టర్మ్‌లో ఇంకా మరిన్ని చర్యలు చేపడతాం. జీహెచ్‌ఎంసీకి ఒక కమిషనర్ కాకుండా పార్కులు, గ్రీనరీ చూసేందుకు ఒక కమిషనర్, చెరువుల అభివృద్ధికి మరో కమిషనర్... ఇలా ఇద్దరు అదనపు కమిషనర్లు నియమించాలని అనుకుంటున్నాం.
- వరద నీటి నిర్వహణ, మురుగునీటి నిర్వహణలో ఇంకా చేయాల్సి ఉంది. వాటిని తప్పకుండా ఆధునీకరించాలి. ఇందుకు రూ.15-20వేల కోట్ల వరకు ఖర్చవుతుంది. వచ్చే టర్మ్‌లో కచ్చితంగా ప్రాధాన్యతాక్రమంలో వాటిని పూర్తి చేస్తాం.
- వారసత్వ సంపద పరిరక్షణకు ఇప్పటికే చాలా చర్యలు తీసుకున్నాం. హైదరాబాద్‌కు యూనెస్కో హెరిటేజ్ సిటీ ట్యాగ్ తేవాలనేది నా కల.







